

పుచ్చకాయ నారు పెంపకంపై అవగాహన దృశ్యం

- సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పండ్ల తోటల ఉద్యాన వన కేంద్రం ఏర్పాటు
- సాగు'బడి'లో ఉద్యాన విద్యార్థులు
- క్షేత్రస్థాయి అధ్యయనంలో పలు అంశాలపై పట్టు
- ఉట్నూర్‌లోని ఉద్యాన నర్సరీలో నెల రోజుల పాటు సాగిన అధ్యయనం



వానపాముల ఎరువును తయారు చేస్తూ..

అధ్యయన వేదికగా.. పండ్ల తోటల కేంద్రం



మామిడిలో అంటు కట్టు విధానంపై అవగాహన..

ఉట్నూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన పండ్ల తోటల ఉద్యాన వన కేంద్రం అధ్యయన వేదికగా మారింది. క్షేత్రస్థాయిలో నేర్చుకున్న అంశాలు ఎంతో బాగున్నాయని, ఇంకొంత కాలం క్షేత్రస్థాయి అధ్యయనం ఉంటే బాగుంటుందని విద్యార్థులు అభిప్రాయ పడ్డారు. నెల రోజులుగా క్షేత్రస్థాయిలో ఉద్యాన విశ్వ విద్యాలయ విద్యార్థులు వివిధ రకాల పంట సాగు పద్ధతులపై అధ్యయనం ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఉట్నూర్‌లోని ఉద్యాన నర్సరీలో ఉంటూ డిప్లొమా హార్టికల్చర్ విద్యార్థులు అధ్యయనం కొనసాగించారు.

క్షేత్రస్థాయి ఎంతో మేలు

తరగతి గదిలో ఎంత నేర్చుకున్నా క్షేత్రస్థాయిలో అనుభవ పూర్వకంగా అధ్యయనం చేస్తేనే ఆ పాఠాలు జీవితకాలం గుర్తుండడంతో పాటు ఉన్నత చదువులు చదవడానికి దోహదపడతాయి. ఈ విధానం వ్యవసాయ, ఉద్యాన రంగాలలో అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు సరిగ్గా సరిపోతుంది. సరిగ్గా అలాంటి కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని దస్నాపూర్‌లో ఉన్న హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) కమిటీ సూచనల మేరకు మొదటిసారి డిప్లొమా హార్టికల్చర్ చదువుతున్న విద్యార్థులకు నెల రోజుల పాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని అధికారులు అమలు చేశారు. దీనిలో భాగంగా దస్నాపూర్‌లోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఉట్నూర్ ఐటీడీఏ పరిధి లోని ఉద్యాన నర్సరీలో నెల రోజులుగా వివిధ పంటలపై అధ్యయనం గావించారు. అంతేకాకుండా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా సూచనతో ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రైతుల సమస్యలపై అధ్యయనం

వివిధ రకాల పంటలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేయడం కోసం నెల రోజుల అధ్యయనం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో విద్యార్థులు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్న పంటల సాగులో మెలకువలు తెలయజేయాలన్న, పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడిందని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ మేరకు ఏడుగురు అమ్మాయిలు గత నెల రోజులుగా ఉట్నూర్ ఉద్యాన నర్సరీలో ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పంటలపై అధ్యయనం పూర్తి చేశారు. వానపాముల ఎరువుల తయారీ, జామలో అంటు కట్టడం, మామిడి, గులామా పంటలో అంటుకట్టడం, మల్చింగ్ వినియోగం, బిందుసేద్యం ఆవశ్యకత, ఎత్తైన మడులలో కూరగాయల నారు పెంపకం, పుచ్చకాయ నారు పెంచి, మొక్కలు ఎత్తయిన బెడ్లపై నాటటం, మామిడి తోటల యాజమాన్యం, పామాయిల్ పంట సాగులో వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు పెంపకం, నీటి సంరక్షణ పద్ధతులు వంటి వాటిపై అధ్యయనం పూర్తి చేశారు.

అండగా ఉన్న అధికారులు

ఉద్యాన నర్సరీలో పాలిటెక్నిక్ విద్యార్థులకు కావాల్సినటువంటి

(తరువాయి 6వ పేజీలో...)

క్షేత్రస్థాయిలో అధ్యయనం బాగుంది
: బోస్లె వర్ష, విద్యార్థిని



ఉట్నూర్ ఉద్యానవన కేంద్రంలో వ్యవసాయ పాలిటెక్నిక్ అధికారుల సూచనలతో క్షేత్రస్థాయిలో నెల రోజుల పాటు మాకు ఇచ్చిన శిక్షన ఎంతగానో బాగుంది. ఇందులో భాగంగా సేంద్రియ ఎరువులు, వానపాముల ఎరువులు తయారు చేయడం నేర్చుకున్నాం.

హెచ్ఎన్‌టీసీ అధికారులు మెరుగైన శిక్షణ అందించారు
: దారిశెట్టి స్వప్న, విద్యార్థిని



వ్యవసాయ పాలిటెక్నిక్ అధికారులు నెల రోజుల శిక్షణలో భాగంగా తమను ఉట్నూర్ హెచ్ఎన్‌టీసీకి పంపించారు. హెచ్ఎన్‌టీసీ అధికారులు నెల రోజుల పాటు మాకు మంచి శిక్షణ అందించారు. అంట్లు కట్టే విధానంతో పాటు మల్చింగ్ విధానములో కూరగాయల సాగు పద్ధతులను నేర్పించారు.

పండ్ల తోటలపై అవగాహన కల్పించాం
: బి.అర్పిత, హెచ్ఎన్‌టీసీ, సాంకేతిక అధికారిని



ఆదిలాబాద్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల నుంచి పంపించిన ఏడుగురు బాలికలకు పండ్ల తోటల పెంపకంపై సంపూర్ణ అవగాహన కల్పించాం. అంతేకాకుండా విద్యార్థినులు సైతం పట్టుదలతో అన్ని విషయాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

నెల రోజుల్లో క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చాం
: గుడిమల్ల సందీప్‌కుమార్, పీహెచ్‌వో, ఉట్నూర్



ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా సూచనల మేరకు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో ఉత్తమ శిక్షణ ఇచ్చాం. పండ్ల తోటల పెంపకం, అంట్లు కట్టే విధానం, మల్చింగ్ విధానంలో కూరగాయల సాగు, తదితర అంశాలపై శిక్షణ అందించాం. అదేవిధంగా బాలికలు సైతం ఎంతో ఇష్టంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రి సీతక్క

అమరులకు.. వందనం

- ఇంద్రవెల్లిలో అమరవీరులకు అధికారికంగా ఘన నివాళ్లు అర్పించిన మంత్రి సీతక్క
- పాల్గొన్న జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

7లో

నేటి నుంచి జొన్న కొనుగోళ్లు

తాంసి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సొసైటీ ఆధ్వర్యంలో జొన్నలు కొనుగోలు చేస్తున్నట్లు సీఈఓ కేశవ్ ఒక ప్రకటన తెలిపారు. తాంసి, భీంపురం మండలాలకు సంబంధించి ఆయా గ్రామాలలో ఎప్పుడు కొను గోలు చేసే తేదీల వారీగా రైతులు జొన్నలు తీసుకురావాలని తెలిపారు. కనీసం 14శాతం తేమతో నాణ్యమైన జొన్నలను మాత్రమే కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ విషయంలో రైతులు ప్రామాణిక పద్ధతులు పాటించాలని ఆయన కోరారు.

త్వరలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ

- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ఉట్నూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 14వేల అంగన్ వాడీ టీచర్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆర్టీసీ సహకారంతో గిరిజన నిరుద్యోగ యువతకు హెవి మోటార్ వెహికల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉన్న ప్రజా ప్రభుత్వం ద్వారా ఇప్పటికే 59వేల ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందన్నారు. గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ కూడా బాగా చదవాలని కోరారు. కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్న వారు ఎందరో ఐపీఎస్ అధికారులను స్ఫూర్తిగా తీసుకొని సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి ఉన్నత ఉద్యోగాలు సాధించారని అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత ఉద్యోగాలలో రాణించాలన్నారు. తల్లిదండ్రులకు భారం కాకుండా ఉద్యోగాలు చేస్తూ చదువుకోవాలన్నారు. పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఎదిగిన వారి స్టోరీలను చదవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఉద్యోగాల భర్తీ కోసం ప్రణాళిక చేస్తుందన్నారు. గ్రూప్ -1,2 టీచర్ మిగిలిన ఉద్యోగాల భర్తీ కోసం కూడా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 11వేల కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. ప్రతీఒక్కరు విశ్వమంత విజ్ఞానం సంపాదించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ మాట్లాడుతూ ఆర్టీసీలో చిన్న ఉద్యోగాలు గిరిజనులకు కేటాయించాలని,అదే మాదిరి ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయంలో కూడా గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మంత్రిని కోరారు. ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన రాజీవ్ యువకిరణాలు శిక్షణ కార్యక్రమాలను గిరిజన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేకాకుండా స్థానిక యువకులకు ఎయిర్‌ఫోర్స్‌లో ఏర్పడే ఉద్యోగాలకు అవకాశం కల్పించాలన్నారు.చాలామంది నిరుద్యోగయువత వృదాగా తిరుగుతు న్నారని అలాంటి వారికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వడానికి శిక్షణ కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏపీఓ జనరల్ జాదవ్ వసంతరావు, ఇన్‌చార్జీ డీడీ జాదవ్‌అంబాజి, పీవీటీజీ ఏపీఓ మేస్రం మనోహర్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



దేవుగూడ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు



ఉట్నూర్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

దేవుగూడలో మంత్రి, ప్రజాప్రతినిధులకు ఘనస్వాగతం

ఉట్నూర్: మండలంలోని దేవుగూడ గిరిజన గ్రామాన్ని ఆదివారం మంత్రి సీతక్క, ఎంపీ నగేష్, ఎమ్మెల్యే బొజ్జుపటేల్, ఎమ్మెల్సీ దండేవిఠల్, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, సబ్ కలెక్టర్ ఉవరాజ్ మర్మాట్‌లు గ్రామానికి రావడంతో ఆదివాసీ గిరిజనులు తమ ఆచార సంస్కృతి వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముందుగా మంత్రి సీతక్క హనుమాన్ మందిరానికి చేరుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల తరగతి గదిని ఎంపీ నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బెంచీలు ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణంలో గిరిజన విద్యార్థులకు ప్రాథమిక విద్యను బోధించడం హర్షణీయం అన్నారు.

ప్రధాని చేతుల మీదుగా జిల్లాకు ఉత్తమ పురస్కారం

- నేడు అవార్డు అందుకోనున్న జిల్లా కలెక్టర్

నార్నూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 21న సోమవారం సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా భారత ప్రధాన మంత్రి మోదీ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా అవార్డును అందకోనున్నారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా నార్నూర్ బ్లాక్ అస్పరెషనల్ ప్రోగ్రాం 2024కు గాను జిల్లా కలెక్టర్ ఈ అవార్డుకు ఎంపిక అయ్యారు. ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం 2024లో నార్నూర్ బ్లాక్ దేశంలో టాప్ 5 లో ఎంపిక అయింది. ఆదిలాబాద్, జిల్లా - తెలంగాణకు గొప్ప గర్వం కలిగించే అంశంగా ఎదిగింది. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ బ్లాక్ 2024 సంవత్సరానికి ప్రగతిశీల బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) కేటగిరిలో ఎంపిక కాగా ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం 2024లో దేశంలోని టాప్ 5 ఆస్పిరేషనల్ బ్లాకుల్లో ఒకటిగా ఎంపికైంది. దేశంలో 426 ఆస్పిరేషనల్ బ్లాకుల్లో నార్నూర్ అద్భుతమైన విజయాలను ప్రదర్శించి టాప్, 5 గుర్తింపును సాధించింది.

అధికారులకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్

జిల్లా కలెక్టర్ రాజర్షిషా కృషి ఇందులో ఎంతో ఉంది. ఆయన తన దూరదర్శితమైన నాయకత్వంతో అహర్నిశలు కష్టపడి కింది స్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నార్నూర్ బ్లాక్ అద్భుతమైన మార్పు ప్రగతిశీలత సాధించడంలో జిల్లా కలెక్టర్ క్రియాశీలక పాత్ర ఉండడం మూలంగా ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. అంతేకాకుండా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మార్గదర్శకత్వంలో నార్నూర్ అనేక కీలక రంగాల్లో ప్రగతిని సాధించింది, ఇందులో గర్భిణి , శిశు ఆరోగ్యం, అంగన్‌వాడీ కేంద్రాల్లో ని చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి సరైన పౌష్టికాహారం అందించి పెరుగుదల పర్యవేక్షించడం, ప్రాథమిక శిశు సంరక్షణ, విద్యా ఫలితాలు, డిజిటల్, ఆర్థిక చేర్పు, గిరిజన సంక్షేమం, ద్వారా మోవా లడ్డు, సహజ వ్యవసాయం, మూడు దశల వ్యవసాయం, చెక్ డ్యామ్స్ నిర్మాణం, స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లీకేజీ ద్వారా రుణాలు అందించడం, ఐసీటీ ఇంటర్వెన్షన్స్ (నార్నూర్ మానిటరింగ్ యాప్, వెబ్‌సైట్) మోడల్ సీఎస్‌సీ సెంటర్, డిజిటల్ ఇండియా, గిరిజన పోషణ్ మిత్ర, వంటి నూతన ఆలోచనల ద్వారా జీవనోపాధి కూడా మంచి పురోగతి సాధించింది. ప్రభుత్వ సహకారంతోపాటు అనేక ఆసక్తి ఎన్జీఓలు తమ వంతు భాగస్వామ్యం చేయడం వారు అందించిన, సీఎస్ఆర్ ఫండింగ్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ముఖంగా నార్నూర్ బ్లాక్ మరింత సుస్థిర అభివృద్ధి వాధించింది. ప్రజా భాగస్వామ్యంతో ఈ విజయాన్ని సొంతం చేసుకుంది డేటా ఆధారితతో అభివృద్ధికి చేయుత నివ్వడంలో సమగ్ర అభివృద్ధి దృఢమైన నిదర్శనం నిలవడంతో దేశ వ్యాప్తంగా మారుమూల ఉన్న నార్నూర్ బ్లాక్ దేశవ్యాప్తంగా మార్పు తీసుకొచ్చే ఇతర ఆస్పిరేషనల్ బ్లాకుల కోసం ఒక ప్రేరణగా నిలిచింది.



ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న జిల్లా కలెక్టర్

జిల్లాకు దేశ స్థాయి పురస్కారం

ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. దేశ స్థాయి పురస్కారం పరిపాలన అభివృద్ధిలో అద్భుతమైన పనిని సొంతం చేసుకున్న వారికి ఇవ్వబడుతుంది. ఏప్రిల్ 2022 నుంచి డిసెంబర్ 2024 వరకు చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి పనులపై ముదింపు చేస్తుంది. ఈ అవార్డు ప్రధానంగా ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి , మౌలిక వసతుల్లో కొలిచే పురోగతిపై దృష్టి పెట్టింది, అన్ని 5 ప్రధాన అంశాల్లో సమగ్ర అభివృద్ధి సాధించినందుకు నార్నూర్ ప్రత్యేకంగా గుర్తించబడింది. మదింపు ప్రక్రియ అనేక దశలుగా జరుగుతుంది. మొదట, పరిపాలన సంస్కరణలు, ప్రజా దర్యాప్తు శాఖ (డీఏఆర్‌పీజీ)పట్ల సీనియర్ అధికారులతో సమగ్ర పరిచయం ద్వారా వివరణాత్మక ప్రదర్శనను ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత డీఏఆర్‌పీ అధికారులు నార్నూర్ బెనిఫిషియరీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వాటిపై గ్రౌండ్ స్థాయిలో ప్రభావం తెల్సుకునే ఒక ప్రత్యేక కాల్ సెంటర్ రౌండ్ నిర్వహించారు. మూడవ దశలో, అదనపు కార్యదర్శి స్థాయి ఇద్దరు అధికారులు నార్నూర్‌ను సందర్శించి, పథకాలు ఎలా అమలవుతున్నాయి, బ్లాక్ అంతటా వాటి ప్రభావాన్ని అంచనా వేసి భాగస్వాములతో సమావేశమయ్యారు. చివరగా, ఈ పర్యవేక్షణ తర్వాత కేబినెట్ కార్యదర్శి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి మదింపు జరిగింది. వివిధ దశల సమగ్ర మదింపు తర్వాత, నార్నూర్ బ్లాక్ ఏబీపీ కింద టాప్ 5 బ్లాకులుగా ప్రకటించబడింది. సమగ్ర సుస్థిర అభివృద్ధి కోసం ఒక ప్రామాణిక బలంగా నిలిచింది.

అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పంచాయతీ రాజ్ మహిళ శిశు సంక్షేమం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు ఐటీడీఏ ప్రాజెక్టు కమ్యూనిటీ ఖుష్బూ గుప్తా, ఆయా విభాగాల జిల్లా అధికారులు సంయుక్త సహకారం జిల్లా ఆస్పరేషనల్ నార్నూర్ బ్లాక్ సంబంధిత అధికారులు, అస్పరేషనల్ బ్లాక్ ప్రతినిధి రాహుల్, డివిజనల్, మండల, గ్రామ అధికారులు అందరి సమిష్టి, సహకారంతో అవార్డును అందుకోవడం జరిగిందని, అందరి సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తి తో జిల్లా అభివృద్ధి తెలంగాణలోని అన్ని జిల్లాల కంటే అగ్రగామిగా నిలిచేందుకు మనందరం కలిసి కట్టుగా కృషి చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చలాన్‌లు చెల్లించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు టీసీ బుక్స్ రికార్డు షీట్ల కోసం బ్యాంక్‌లో చలాన్ చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్‌పీఎస్ఎస్, కేజీబీవీ, మోడల్, ప్రైమరి స్కూళ్లలో రికార్డు షీట్ కోసం రూ.400, టీసీ బుక్ కోసం రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో రికార్డు షీట్ల కోసం రూ.1000, టీసీ బుక్ కోసం రూ.1200 చెల్లించాలన్నారు. పాత రికార్డు షీట్, టీసీకు సంబంధించిన మొదటి, చివరి పేజీలను జిరాక్స్ చేసి ఎంఈవో, సంబంధిత ప్రధానోపాధ్యాయుల సంతకంతో డీఈవో కార్యాలయంలో సమర్పించాలని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు గమనించాలని డీఈవో పేర్కొన్నారు.

రాష్ట్రంలోనే జిల్లా కలెక్టర్ పనితీరు భేష్

- సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి గజానంద్ నాయక్

నార్నూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా సోమవారం నార్నూర్ మండల బ్లాక్ అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం విభాగంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో శ్రేష్టతకుగాను ప్రధాన మంత్రి ద్వారా అవార్డ్ తీసుకోనున్న జిల్లా కలెక్టరు రాజర్షిషా శుభ పరిణామం అని, రాష్ట్రంలోనే ఆయన పనితీరు బాగుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. గజానంద్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మీడియా సమా వేశంలో మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం తెలంగాణలోని నార్నూర్ మండలానికి ప్రధానిచే అవార్డ్ ఇవ్వడం అంటే జిల్లా కలెక్టర్ పనితీరు, ఆయన చేసిన అభివృద్ధి సహకారం చాలా గొప్పది అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే నార్నూర్‌కు ఒక్క గొప్ప ప్రత్యేకత ఉంది అభిప్రాయపడ్డారు. ఈ అవార్డ్ ద్వారా రాబోయే రోజులో మరింత అభివృద్ధి కి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని అధిక నిధుల విడుదల చేయాలి అని కోరారు. అంతరం విద్యావేత్త బాలాజీ కాంబ్లేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట నాయకులు ఉత్తం రాథోడ్ జేఏసీ మాజీ చైర్మన్, నర్సింగ్ మోరే, బ్రిజ్‌లాల్, దదేఅల్లి, సుభాష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠాపన

తాంసి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పర్ల గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన అంగర వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో మహా యజ్ఞం నిర్వహించారు. 11 మంది వేద పండితులు తమ మంత్రలతో మా యజ్ఞం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ప్రతిష్ఠాపన అనంతరం మధ్యాహ్నం సమయంలో పెద్ద ఎత్తున అన్నగాన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహేందర్, గ్రామాభివృద్ధి నాయకులు పడాల శేఖర్, గంగన్న పోచన్న, తదితరులు పాల్గొన్నారు.

బరంపూర్ తిరుమల కొండను దర్శించుకున్న గుంటూరు భక్తులు

తలమడుగు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ కొండపై స్వయంగా వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన 150 మంది భక్తులు శ్రీస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా ఇటీవల ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు స్వామి వారి కళ్యాణం స్వామివారి చరిత్ర దినం దినం తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతున్న స్వామి వారి చరిత్ర పత్రికలో సోషల్ మీడియాలో తెలుసుకొని స్పెషల్ దర్శనం కోసం గుంటూరు నుంచి ఆదిలాబాదుకు ట్రైన్ ద్వారా వచ్చి ఆదిలాబాద్ నుంచి బస్సులు తీసుకొని ఆలయానికి రావడం జరిగిందన్నారు. కొండపైన స్వయంగా వెలిసిన స్వామి వారి ఆలయాన్ని ఎంతో అందంగా సుందరీకరణ ఆలయ నిర్మాణ చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు మరింత అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గుంటూరు నుంచి వచ్చిన భక్తులకు ఘనంగా సన్మానించి అన్నప్రసాదాన్ని అందించి ఆలయ చరిత్రను వివరించారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షులు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, ఆలయ పూజారి స్వస్తిక్ స్వామి, కమిటీ సభ్యులు బి.మల్లేష్, నాగారెడ్డి, ప్రతాప్, రాజు, శ్రీనివాస్, రమాకాంత్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అడెల్లి పోచమ్మ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

● మాజీ మున్సిపల్ కమిషనర్

తలమడుగు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గత దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉన్న అడెల్లి పోచమ్మ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని మాజీ మున్సిపల్ కమిషనర్ చింతలపల్లి దేవా రెడ్డి సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డిలు కోరారు. ఆదివారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి బట్టి సవర్గమ్మ, కాజ్జర్ల, భారంపూర్. గ్రామాల మీదుగా నిర్మల్ జిల్లా అడెల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం గతంలో నిధులు మంజూరయ్యాయని, అయినా ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం లేదన్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయితే నిర్మల్ జిల్లా అడెల్లి ఆలయానికి వెళ్లే భక్తులకు దూర భారం తగ్గుతుందన్నారు. అంతేకాకుండా రైతుల పండించిన పంటలను నిర్మల్ జిల్లాలో విక్రయించుకునే అవకాశం లభిస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా రోడ్డు పక్క గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయి అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఇందులో గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు సన్మానం

నార్నూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క యువజన నార్నూర్ మండల ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్ ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో శాలువాతో సన్మానం చేసి మండల అభివృద్ధికి సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు, రోడ్లు, చాలా గ్రామాల్లో నిట్టి సమస్య ఉంది, రాజీవ్ యువ వికాస పథకం ద్వారా అత్యధిక యూనిట్లు మంజూరు, డిగ్రీ కళాశాల, మార్కెట్ యార్డ్ అభివృద్ధికి సహకరించాలని మంత్రికు విన్నవించారు. అంతేకాకుండా సంబంధిత అంశాలపైన అభివృద్ధికు సహకరిస్తే అంటు మంత్రి హామీ ఇచ్చినట్లుగా ఆయన తెలిపారు. వారి వెంట నాయకులు నాసిర్, రమేష్ దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఈస్టర్ వేడుకలను ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇందులో బాగంగా జిల్లా కేంద్రంలోని పలు చర్చిల్లో ఆదివారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. యేసు పునరుత్థానమును గుర్తు చేసుకుంటూ పాటలు పాడారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్లు ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు. యేసు ప్రభువు చూపిన మార్గంలో శాంతి, సహనం, పరస్పర సహకార గుణాలతో జీవించాలని వారు ఈ సందర్భంగా సూచించారు.

నిర్మల్ జిల్లాలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదు

ఖానాపూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో ఆదివారం భానుడు తన ప్రతాపాన్ని ప్రదర్శించాడు. తెల్లవారిందే మొదలు ఎండ తీవ్రత అధికంగా కనిపించింది. ఉదయం 10 గంటల నుంచి తీవ్రమైన ఉక్కపోత నెలకొనడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 42.5 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

అపూర్వ ఆత్మీయ సమ్మేళనం

ఉట్నూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తాము 35ఏళ్ల క్రితం చదువుకున్న పాఠశాలలో పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మయ సమ్మేళనంలో కలుసుకున్నారు.ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనంలో కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఉన్నత విద్య అందించిన గురువులకు పూర్వ విద్యార్థులు సన్మానం చేసి ఉపాధ్యాయులను గౌరవించారు.ఈ సందర్భంగా విద్యార్థులు అందరు తమ అనుభవాలను నెమరు వేసుకున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్న విద్యార్థులు

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● డీఎఫ్‌వో సురేష్ కుమార్ ● ఆదిలాబాద్ జిల్లాలో ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు ● పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏ క్షణంలో ప్రమాదం సంభవించినా వెంటనే తమకు సమాచారం అందించాలని డీఎఫ్ఓ సురేష్ కుమార్ సూచించారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. అగ్ని ప్రమాదాల నివారణ పై వారం రోజులపాటు జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఆ శాఖలో పని చేసి పదవి విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో సత్కరించి వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డీఎఫ్ఎ సురేష్ కుమార్ మాట్లాడుతూ అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల ఉద్దేశాన్ని వివరించిన ఆయన పదవి విరమణ పొందిన ఉద్యోగుల సేవలను గుర్తించి వారిని సత్కరించినట్లు పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు.



మాట్లాడుతున్న డీఎఫ్‌వో సురేష్ కుమార్

కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ రాజేశ్వర్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జగత్ రామ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో శ్రమిస్తేనే భవిష్యత్తు

● నిర్మల్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్ రావు

ఖానాపూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో శ్రమిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని నిర్మల్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని మస్కాపూర్‌లో గల విజేత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల 15వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ప్రముఖ రచయిత షియాన్ సంపత్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, టీఎన్జీవో రాష్ట్ర నాయకులు నాగరాజు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, ప్రముఖ వైద్యులు కిరణ్ కుమార్, డీఆర్బీఎస్ జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, ప్రముఖ న్యాయవాదులు వెంకట మహేంద్ర, తోట సుమిత్, బాశెట్టి శివ కుమార్, ఖాజా, శేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, లక్ష్మీ నర్సయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులున్నారు.



సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



పాఠశాలను సందర్శించిన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

స్పోర్ట్స్ స్కూల్‌ను సందర్శించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్

నార్నూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించి క్రీడల్లో వారిని ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లాలని ప్రభుత్వం సిద్ధంగా ఉందని అందుకు స్పోర్ట్స్ పాఠశాలలో సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేయొద్దని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్లో ఉన్న సమస్యలను స్వయంగా డీవైఎస్ఓను అడిగి తెలుసుకున్నారు.

జ్యోతిష్య శాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకున్న ఎల్కాచి శ్రవణ్‌కుమార్ జోషి

నేరడిగొండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్య శాస్త్రంలో డాక్టర్ రేట్ పట్టా అందుకున్న ఎల్కాచి శ్రవణ్‌కుమార్ జోషి మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన ఎల్కాచి శ్రవణ్‌కుమర్ జోషి (రాజు పంతులు) శుక్రచ్చాయ వేదాంతం యూనివర్సిటీ కర్ణాటక వారిచే జ్యోతిష్య ఆచార్య బిరుదుతో సత్కారంతో పాటు జ్యోతిష్యంలో డాక్టర్‌రేట్ (పీహెచ్‌డీ)పట్టా అందుకున్నారు. కాగా, వడూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పురోహితుడు వేద పండితులు ఎల్కాచి శ్రావణ్‌కుమార్ జ్యోతిష్యశాస్త్రంలో ఆలస్య వివాహాలు, సంతానం అనే అంశంపైన పరిశోధన చేసినందుకు గాను శుక్రాచార్యమెదక్ యూనివర్సిటీ కర్ణాటక వారు డాక్టరేట్‌తో పాటు, జ్యోతిష్య ఆచార్య, జ్యోతిష్య శిరోమణి,బిందును ప్రధానం చేశారు. సింహాచలం వేదికగా ఈ బిరుదును ప్రధానం చేశారు.

నార్నూర్, గాదిగూడ మండలాల్లో ఘనంగా బీఆర్ఎస్ జెండాల ఆవిష్కరణ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి ఆదేశాను సారం ఆదివారం నార్నూర్ గాదిగూడ మండలంలోని నార్నూర్, భీంపూర్, మన్కాపూర్, పూసిగూడ గ్రామాల్లో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మెస్రం హనుమంత్ రావు అధ్యక్షతన జెండా ఆవిష్కరించి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీరాం నాయక్, ప్యాక్స్ చైర్మన్ సురేష్, తొడసం నాగు రావు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్, ఉరవెత రుప్‌దేవ్ సర్పంచ్ సంఘం మండల అధ్యక్షులు, పార్టీ జనరల్ సక్రెటరీ, సయ్యద్ ఖాసిం, మడావి రుప్‌దేవ్, మాజీ సర్పంచ్, కనక ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ, రమేష్, మాజీ సర్పంచ్ విష్ణు, బాబా ఖాన్, మాజీ రాయి సిడాం రుప్‌దేవ్, దేవక బాయి, మెస్రం నాగురావు, శివాజీ, బోజ్జీ, విఠల్, లక్ష్మణ్, అహ్మద్, మసుద్, దిలీప్, శేశాంత్, దేవిదాస్, నార్నూర్ మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అదుపు తప్పి వాహనం బోల్తా

నర్సాపూర్(జి), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంజనీ తండా అడవిలో ఆదివారం టాటా ఏసీ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఉమ్మెడ గ్రామానికి చెందిన ముత్తమ్మ సారంగాపూర్ మండలంలోని అడెల్లి గ్రామంలో మొక్కులు తీర్చుకొని తిరుగు ప్రయాణంలో అంజనీ తండా దట్టమైన అడవి యందు ఎఫ్ఐ ప్లాంటేషన్ పరుపు బండ గుట్ట వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంలో ఐదుగురు మహిళలు, ఐదుగురు చిన్నారులు, ఇద్దరు యువకులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ముత్తమ్మ, నీరజ, సోనీ, మీనాకు మెడ భాగంలో తీవ్ర గాయాలు అయ్యాయి. కాగా, గాయపడ్డ వారిని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

30 మంది పేదలకు దుస్తుల పంపిణీ

లోక్వేరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మంత్రి కీశే జి. గడ్డెన్న 21వ వర్ధంతి సందర్భంగా మా అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు 30 మంది నిరుపేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా భైంసా చుట్టుపక్కలలో గల దాదాపు 30 మంది నిరుపేదలకు, అభాగ్యులకు నూతన దుస్తులను మా అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ ఎం.ఆంజనేయులు అందజేయడం జరిగింది.

బైక్‌ను ఢీకొట్టిన కారు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాపూర్, బాబాపూర్ ఎక్స్‌రోడ్ మధ్య వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. కాగా, బైక్ పైన ఉన్న సుంకే భూమరాజం(45), మానాల రాజేశ్వర్ అనే ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో ఈఎంటీ దీపక్, పైలెట్ నవీన్ కుమార్ వచ్చి ప్రథమ చికిత్స చేసి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మార్గ్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ప్రియదర్శిని నగర్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహించినట్లు ఎన్నికల అధికారిగా మారెడ్డి శ్రీనివాస్, గోండ శంకర్, తోడిశెట్టి పరమేశ్వర్‌లు తెలిపారు. మూడవసారి కాలనీ కమిటీ అధ్యక్షులుగా భూసారపు గంగాధర్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శి శివరాం వెంకటేష్, కోశాధికారిగా చిటిమల సదయ్య, ఉపాధ్యక్షులుగా ద్యాగ లక్ష్మీరాజు, జాయింట్ సెక్రటరీగా సాయినాథ్‌లు ఎన్నికయ్యారని తెలిపారు.

ఆవోపా ఆధ్వర్యంలో ఆర్థో వైద్య శిబిరం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం ఆర్య వైశ్య అఫీషియల్, ప్రొఫెషనల్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీకర్ హాస్పిటల్ వైద్యులు అన్వేష్ గౌడ్ బృందం 250 మందికి ఉచిత పరీక్షలు, బీఎండీ పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఇందులో సంఘ బాధ్యులు జొన్న వినోద్, టి. నారాయణ, దయానంద్, ఏ. రమణ, మంత్రి శ్రీనివాస్, పోలిశెట్టి విలాస్, మాధవి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

నాట్య బృందాన్ని అభినందించిన ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన భరత నాట్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన నాట్య బృందాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం అభినందించారు. భరత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. నిర్మల్ నృత్యమాల నాట్య అకా డమీ గురువు అంజలి ఆధ్వర్యంలో శిక్షణపొంది రాష్ట్ర, జాతీయ అవార్డు పొందడం హర్షణీయమని ఎమ్మెల్యే ప్రశంసించారు.

నాడు ఉద్యమకారులను పొట్టనపెట్టుకున్నారు

● బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ● ఇంద్రవెల్లికి భారీగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

ఖానాపూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అప్పటి పాలకుల నిర్లక్ష్యంపు దోపిడీని సహించలేక జల్, జంగల్, జమీన్ నినాదంతో నాటి పాలకులపై పోరాడిన ఉద్యమకారులను పొట్టన పెట్టుకొని.. నేడు వారికి అధికారికంగా ఈ ప్రభుత్వమే తిరిగి నివాళులర్పించిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లిలో నిర్వహిస్తున్న అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో పాల్గొనేందుకు ఖానాపూర్ నుంచి జాన్సన్ నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఇంద్రవెల్లి తరలివెళ్లే ముందు ఖానాపూర్‌లో విలేకరులతో జాన్సన్ నాయక్ మాట్లాడారు. ఈ సందర్భంగా దున్నే వాడిదే భూమి, 'మావ నాటే మావ రాజ్' అనే నినాదంతో ఉద్యమించిన ఆదివాసి గిరిజనులను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తుపాకి గుళ్లతో హతమార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు అమరుల స్థూపం వద్ద అధికారికంగా నివాళులర్పించి నాటి పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకునే ప్రయత్నం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంద్రవెల్లి స్థూపం వద్ద ఆంక్షలు ఎత్తి వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంద్రవెల్లి పోరాటంలో అమరుల కుటుంబాలను పూర్తిస్థాయిలో గుర్తించి వారి కుటుంబాలను ఆదుకున్నప్పుడే అమరులకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. అప్పటి వరకు ఈ ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగిస్తామని జాన్సన్ నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రాజగంగన్న, డీఆర్బీఎస్ జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, తదితరులున్నారు.



ఇంద్రవెల్లి అమరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

అధ్యయన వేదికగా పంట్ల తోటల కేంద్రం

(5వ పేజీ తరువాయి...)

అవగాహన కార్యక్రమాలను ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్‌కుమార్ నర్సరీ సాంకేతిక అధికారిణి అర్పితలు ఏర్పాటు చేశారు. వీరు స్వయంగా విద్యార్థులకు అంట్లు కట్టడం, మల్చింగ్ వాడకం, బిందుసేద్యం వంటి విష యాలపై పూర్తిస్థాయిలో క్షేత్ర స్థాయిలోనే అవగాహన కల్పించారు. ఈ అధ్యయనం విద్యార్థులకు భవిష్యత్తులో వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు గా, అధికారులుగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడనుంది.



వానపాముల ఎరువు తయారీ శిక్షణ పొందుతున్న పాలిటెక్నిక్ విద్యార్థినులు



మంటలు ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సోయా మిల్లు వద్ద అగ్ని ప్రమాదం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాంపూర్ సమీపంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాంపూర్ జాతీయ రహదారి పక్కన మూతపడి ఉన్న సోయా మిల్లు వద్ద చెత్తకు మంటలంటుకున్నాయి. మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ సహాయంతో తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారులు సూచించారు. ఇందులో స్టేషన్ ఆఫీసర్ జైత్‌రాం, సిబ్బంది యస్వాని, రాము పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

ఉట్నూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని పులిమడుగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరోకరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఇంద్రవెల్లి వైపు నుంచి సాలెవాడ(కే)కి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కోవా ప్రకాష్ (35)కు ఆదిలాబాద్ వైపు నుంచి ద్విచక్ర వాహనం పై ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ప్రకాష్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఆయన వెంట ఉన్న కనక దత్తుకు గాయాలు కావడంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనదారులకు స్వల్ప గాయాలతో బయట పడగా సాలెవాడకు చెందిన ప్రకాష్ మృతి చెందాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుడికి భార్య పుష్పతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారని గ్రామస్థులు తెలిపారు. ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన మద్దెల రాంచరణ్(14) అనే బాలుడి మృత దేహం స్థానిక వాగులో ఆదివారం లభ్యమైంది. గ్రామస్థుల వివరాల ప్రకారం రాంచరణ్ ఎప్పటి మాదిరి గత శనివారం మధ్యాహ్నం దోస్తులతో కలిసి వాగులో స్నానం చేయటానికి వెళ్లాడు. ఎస్సారెస్పీ కెనాల్ ప్రవహిస్తున్న కారణంగా వాగులో నీటి ఉధృతి పెరిగి రాంచరణ్ నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన తోటి స్నేహితులు భయపడి పరారయ్యారు. బాలుడు సాయంత్రం అయినా ఇంటికి రాకపోవటంతో ఆరా తీయగా విషయం తెలిసింది. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో దర్యాప్తు చేపట్టారు. బాలుడు స్నానానికి దిగిన చోట గాలించగా మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఇద్దరు కుమారులలో చలాకిగా ఉండే చిన్నవాడైన రాంచరణ్ మృతి చెందటంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

దేవాపూర్‌లో జొన్న పంటకు నిప్పు

తలమడుగు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపూర్ గ్రామానికి చెందిన ఎంబడి రఘు అనే రైతు పొలంలో నిప్పు అంటుకొని రెండు ఎకరాల పొలంలో గల జొన్న పంటకు నిప్పు తగలడంతో కాలి బూడిదైందని రైతు తెలిపారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ చేతికొచ్చిన జొన్న పంట ప్రమాదవశత్తు విద్యుత్ ఘాతంతో నిప్పు రవ్వ రావడంతో ఎండిన జొన్న పంటపై చేతికొచ్చిన జొన్న పంట కాలి బూడిద అయిందన్నారు. జొన్న పంటతో పాటు చేనులో గల డ్రిప్పు పైపులు, మోటారు ఇతర పైపులు కాలిపోయే అన్నారు. వీటి విలువ లక్ష 50 వేల రూపాయల వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతుకు ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేయాలని గ్రామస్థులు కోరారు.

'అంబేద్కర్‌ను అవమానించిన అగోరిని ఉరి తీయాలి'

నార్నూర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన లేడి అగోరిను ఉరి తీయాలంటూ తెలంగాణ మాదిగ హక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరెలా మహేంద్ర కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓ సైకో వ్యక్తి అబం శుభం తెలియని అమ్మాయిల జీవితంతో నాటకాలు అడుతు సోషల్ మీడియా వేదిక ప్రజలను భయాభ్రాంతులకు గురి చేస్తూ చట్టానికి వ్యతిరేకంగా పోలీస్ వ్యవస్థను సైతం బూతులు తిడుతున్న ప్రభుత్వాలు అతనిపై కట్టిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. ఏకంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను సైతం అనుచిత వ్యాఖ్యలు చేసి అవమాన పరిచారు. ఒక్క వ్యక్తి ఫేమస్ కావడానికి సోషల్ మీడియాలో వేదిక ఏమైన అంటే ఎలా బరిస్తారు. కచ్చితంగా ఆయన ఉరి తీయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల భారీ ఎత్తున్న దళిత సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వారి వెంట నాయకులు బర్కుంబే రాజు, శ్రీకాంత్, సురేందర్, సునీల్ ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కండక్టర్ శ్యామల బస్సులో మర్చిపోయిన పర్సును ఆదివారం ప్రయాణికురాలికి అందించి నిజాయితీ చాటుకున్నట్లు డిపో క్లర్క్ ఎన్ఆర్ శేఖర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల నుంచి నిర్మల్‌కు ప్రయాణిస్తున్న జగిత్యాల వాసి గుగ్గిళ్ళ మనోజ్ఞ నిర్మల్ డిపో బస్సు టీఎస్ 18 టీ 4456లో చేతి పర్సు సీటుపై పెట్టి మర్చిపోయారు. డిపోలో బస్సుపు అప్పగించేటప్పుడు కండక్టర్ శ్యామలకు పర్సు కనబడిందని దానిని డిపో క్లర్క్‌కు అప్పగించినట్లు తెలిపారు. అందులో రూ.20,000ల విలువ చేసే చెవి కమ్మలు ఉన్నాయని, ప్రయాణికురాలిని డిపోకు పిలిపించి అప్పజెప్పడం జరిగిందని తెలిపారు. నిజాయితీగా బంగారాన్ని అప్పజెప్పిన కండక్టర్, డ్రైవర్‌లను డిపో మేనేజర్ పండరి అభినందించారు.



ప్రయాణికురాలికి చెవి కమ్మలను అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది


మాట్లాడుతున్న ఎంపీ నగేష్


... ఎమ్మెల్యే వెడ్మబొజ్జు


... ప్రేంసాగర్‌రావు


సభకు హాజరైన గిరిజన ప్రజలు

అమరులకు వందనం

● ఇంద్రవెల్లి అమరవీరులకు ఘన నివాళి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): 1920 ఏప్రిల్ 20న భూమి కోసం, భుక్తి, విముక్తి కోసం నినాదించి అమరులైన ఇంద్రవెల్లి అమరవీరులకు అధికారికంగా నిర్వహించిన ఆదివాసీ అమరవీరుల సంస్మరణ సభకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, అమరవీరుల కుటుంబ సభ్యులు హాజరై ఆదివారం స్థానిక ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళి అర్పించారు.

● సంప్రదాయ రీతిలో నివాళులు

అమరవీరులకు నివాళులర్పించడానికి మండలంలోని వారి కుటుంబ సభ్యులతోపాటు ఆదివాసీ గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రంలోని గోండుగూడ గ్రామ పటేల్ మడావి ఇంద్రు ఇంటి నుంచి ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాల మధ్య ర్యాలీ నిర్వహించి ఆదివాసీల ఆరద్యాదైవం ఇంద్రాయి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుని సంప్రదాయ వాయిద్యాలతో డోల్, పేప్రే, కాళీకోమ్, తుడుంల మోతల మధ్య అత్యంత వైభవంగా అమరవీరుల పేరిట జెండాను ఆవిష్కరించారు. సంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు.

నివాళులర్పించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి స్థూపం వద్ద మంత్రి సీతక్క, నివాళులర్పించారు. అలాగే ఆమెతోపాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ గోడం నగేష్, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటేల్, మాజీ ఎంపీ సోయంబాపురావు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎంపీ వేణుగోపాల్ చారి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగు ణక్క, ఆదివాసీ రాయిసెంటర్ జిల్లా సార్మేడీ మెస్రం దుర్గు పటేల్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వ రీబా యి, మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బీఆర్ఎస్ ఖానాపూ ర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భూక్యా జాన్సన్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, రగల్ జెండా కమిటి అధ్యక్షులు తోడసం నాగోరావు, నాయకులు సీడాం భీంరావ్, కేస్లాపూర్ సార్మేడీ మెస్రం వెంకట్రావు పటేల్, చిన్నుపటేల్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్ రావు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బరాష్ట్ర కోకన్వీనర్ గణేష్, నాయకులు నివాళ్లర్పించారు.

గిరిజనుల అభివృద్ధికి కృషిచేయాలి: ఎంపీ

ఇంద్రవెల్లి, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లిలో దమనకాండలోఅసువులు బాసిన అమరవీరుల త్యాగాలను గుర్తించి అధికారికంగా అమరవీరుల సంస్మరణ సభను జరపడం అభినందనీయమన్నారు. అలాగే వారి కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రాష్ట్ర గిరిజన శాఖకు నిధులను విడుదల చేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ సభ్యుడు గోడు నగేష్ అన్నారు. 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సవాలకు సంబంధించి రూ.565 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేసి జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేయాలని, ఈ విషయాన్ని మంత్రి సీతక్క ప్రత్యేకంగా చొరవతీసుకోవాలని ఎంపీ సూచించారు.

ప్రజాప్రభుత్వంలోనే ఆదివాసీలకు న్యాయం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ప్రజాప్రభుత్వంలోనే ఆదివాసీ గిరిజనులకు న్యాయం జరుగుతుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం మూలంగానే ఆంక్షల మీద ఆంక్షలు విధిస్తూ నివాళులర్పించకుండా అణగతొక్కేవారన్నారు. కొందరు నాయకులకు మాత్రమే నివాళులర్పించేందుకు అవకాశం కల్పించి, ఆదివాసీ బిడ్డలను వెనక్కి పంపేవారన్నారు. నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో నేటి సీఎం రేవంత్ రెడ్డి ఇంద్రవెల్లిలో దళిత గిరిజన దండోరా సభలో ఇచ్చిన మాట ప్రకారం రూ.కోటితో స్మృతి వినోదంతోపాటు, అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలనే ఆశయంతో ఇళ్ళ స్థలాలు, స్వయం ఉపాధి కోసం ట్రాక్టర్లు, బొలేరో వాహనాలు అందించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రతీ కుటుంబానికి రూ.20వేల ఆర్థికసాయం

● మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్

అమరవీరుల ప్రతీ కుటుంబానికి తనవంతుగా 20వేల ఆర్థిక సహాయాన్ని మంత్రి సీతక్క చేతుల మీదుగా అందిస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ అన్నారు. ఆదివారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు ఘన నివాళి అర్పించిన అనంతరం సభలో మాట్లాడారు.

● పోలీసుల బందోబస్తు

ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ సభకు స్థానిక ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసులతో బందోబస్తు చేశారు.

● వైద్య శిబిరం

స్థానిక అమరవీరుల స్తూపం వద్ద అమర వీరుల సంస్మరణ సభకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.


సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అమరుల కుటుంబాలను ఆదుకుంటాం

● అమరవీరుల కుటుంబాలకు ట్రాక్టర్లు అందజేసిన మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లి ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్ద ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరవీరుల సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. ముందుగా అమరవీరుల స్థూపం అసువులు బాసిన అమరవీరులకు ఘన నివాళి అర్పించి, సంప్రదాయ పూజల్లో ఆమె పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. గత 44 ఏళ్ల క్రితం జరిగిన ఘటనలో ఎందరో ఆదివాసీ బిడ్డలు అమరులవడం దురదృష్టకరమన్నారు. అమరవీరుల కుటుంబాలకు ఐటీడీఏ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కల్పనతోపాటు వారి కుటుంబాల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. దీనిలో భాగంగానే అమరవీరుల సంస్మరణ దినోత్సవం రోజున అమరవీరుల కుటుంబాలకు ట్రైక్రార్ ట్రాక్టర్లు, బొలేరో వాహనాలను అందించామన్నారు. ఆనాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇక్కడికి వచ్చి, ఇచ్చిన మాటకు కట్టుబడి 15 మంది అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడంతోపాటు, కోటి రూపాయలతో స్మృతి వనం ఏరాటుకు కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అయితే ఇంద్రవెల్లిలో జరిగిన పోరాటంలో 15 మంది బిడ్డలు అమరులయ్యారని ఆనాటి ప్రభుత్వాలు నిర్ధారించాయన్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కువ మంది ఆదివాసీ బిడ్డలు అమరులవడం జరిగిందని తెలపడం జరుగుతుంది. వారి వివరాలను ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో గుర్తించి వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏరడిన ప్రభుత్వంలో ప్రజలు హక్కుల కోసం, ప్రజాస్వామికంగా, నిరుపేదలు సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, సన్నబియ్యం, మహిళలకు వడ్డీ లేని రుణాలు లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని మంత్రి సీతక్క అన్నారు. ఆనాడు గత ప్రభుత్వాలు ఆదివాసీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా పరిపాలన అందించేందుకు ఐటీడీఏలను ఏర్పాటు చేశారు. కానీ తర్వాత అధికారంలోకి వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో మరుగున పడ్డాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐటిడిఏతోపాటు 29 శాఖలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. అటవీ హక్కుల చట్టం తీసు కొచ్చి ఆదివాసీ గిరిజనులకు అటవీ హక్కు పత్రాలను ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. అదేవిధంగా ఆదివాసీలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలిగించే ఐటీడీఏలను బలోపేతం చేసి ఆదివాసీ గిరిజనులను ఆదుకుంటామని ఆమె పేర్కొన్నారు.


వాహనాన్ని అందజేస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

ఉపాధి కూలీలకు వసతులు కరువు!

● పని ప్రదేశాల్లో కనిపించని నీడ, నీరు ● ఎండలకు ఇబ్బందులు పడుతున్న కూలీలు ● సౌకర్యాలు కల్పించాలని కోరుతున్న కూలీలు


కుభీర్‌లో చెట్ల కింద సేద తీరుతున్న ఉపాధి కూలీలు

కుభీర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఉదయం 8గంటలకే ఎండ తీవ్ర పెరిగిపోతోంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేవు. దీంతో రైతులు, కూలీలు ఉపాధిహామి పనులకు వెలుతున్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు నివారించేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకాన్ని ప్రారంభించింది. దీంతో తమ గ్రామాల్లోనే ప్రజలకు ఉపాధి లభిస్తోంది. పని చేసే చోట నీడ సౌకర్యం లేక పోవడంతో వడదెబ్బ, అలసట ఏర్పడి కూలీలు అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎలాంటి సౌకార్యలు కల్పించడం లేదు. గతంలో టెంట్‌లు, గుడారాలు ఏర్పాటు చేసేవారు. గాయాలైతే ప్రథమ చికిత్సకు వైద్య సామగ్రి అందుబాటులో ఉండేంది. ప్రస్తుతం వాటి జాడ లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎండలతో పొంచి ఉన్న ప్రమాదం

మండలంలోని 42 గ్రామ పంచాయతీలకు గాను 38 జీపీల్లో ఉపాధి హామీ పనులు సాగుతున్నాయి. వేసవికాలంలో ప్రధానంగా వ్యవసాయ అనుబంధ పనులను మంజూరు చేశారు. మండలంలో 11వేల 360 జాబ్ కార్డులున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 686 మంది కుటుంబాలు వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్నారు. వేసవి దృష్ట్యా పంట చేన్లు, చెరువులు, కుంటలు, వ్యవసాయ అంతర్గత రహదారుల్లో పనులు చేపడుతున్నారు. ఏప్రిల్ 15న మండలంలో 5336 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. ఇలా రోజుకు సగటున 5వేల 200 మందికి పైగానే కూలీలు హాజరవుతున్నారని ఈజీఎస్ అధికారులు తెలుపుతున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఎం డలు ప్రస్తుతం 38డిగ్రీలు దాటుతున్నాయి. ఏప్రిల్, మే నెలలో ఎండవేడిమి మరింత పెరిగే అవకాశముందని పలువురు తెలుపుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నష్టం జరగకముందే కూలీలకు సౌకార్యలు కల్పించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

● హరిలాల్ ఏపీవో కుభీర్



కూలీలు పనిచేసే చోట నీటి సౌకర్యం కల్పించాలని గ్రామ పంచాయతీలకు ఆదేశించాం. నీటివసతి కల్పించేందుకు ఒక్కరికి రూపాయి చొప్పు చెల్లిస్తున్నాం. టెంట్‌లు, గూడారాలు, ఏర్పాటుకు జిల్లా అధికారులతో విషయాన్ని వివరించి వారి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం. ఎండ దృష్ట్యా కూలీలు ఉదయమే పనులకు వెళ్లి మధ్యాహ్నం వరకు ఇంటికి చేరుకోవాలని సూచిస్తున్నాం.

సహకార స్ఫూర్తి.. సేవా విస్తృతి

● అభివృద్ధి బాటలో బన్సపల్లి సొసైటీ


బన్సపల్లి పీఏసీఎస్ కార్యాలయం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాల మంజూరుతోపాటు సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందిస్తూ బన్సపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తన సేవలను విస్తరిస్తోంది. రెండు మండలాల్లోని 20 గ్రామాలకు సేవలందిస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా పాలకవర్గం, సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ అన్నదాతల మన్ననలను పొందుతోంది.

విరివిగా పంట రుణాలు

బన్సపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 2,739 మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. వీరిలో 1,995 మంది పురుషులు కాగా 744 మంది మహిళా రైతులున్నారు. దిలావర్‌పూర్ మండలంలోని 11 గ్రామాలతో పాటు నర్సాపూర్(జి) మండలంలోని 9 గ్రామాల రైతులకు బన్సపల్లి పీఏసీఎస్ సేవలందిస్తోంది. రైతులకు సుమారు రూ. 11 కోట్లకు పైగా పంట రుణాలు, వ్యవసాయ అనుబంధంగా రైతులు మరింత ఆర్థికాభివృద్ధి, స్వయం సమృద్ధి సాధించడానికి గొర్రెల పెంపకం, డైరీఫారమ్‌లకు, ఇతర దీర్ఘకాలిక రుణాల కింద రూ.5కోట్లు అందించారు.

ఐదేళ్లలో రెట్టింపైన రుణాలు

ఐదేళ్ల క్రితం రూ.5కోట్ల పంట రుణాలు ఇవ్వగా ప్రస్తుతం రూ.11కోట్లను పంట రుణాల కింద సొసైటీ ద్వారా అందించారు. దీర్ఘకాలిక రుణాల కింద అప్పుడు రూ. 2 కోట్లు ఇవ్వగా, ఇప్పుడు రూ.5కోట్లను ఇచ్చారు. బన్సపల్లి సొసైటీలో ఐదు సంవత్సరాల క్రితం 1800 మంది సభ్యులుండగా ప్రస్తుతం సొసైటీలో 2,739 సభ్యులకు పెరిగింది.

అందుబాటులో ఎరువులు

రైతులకు సకాలంలో ఎరువులు అందించడానికి దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), బన్సపల్లి గ్రామాల్లో మూడుకేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులకు ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయిస్తున్నారు.

వరి ధాన్యం కొనుగోలు

కష్టపడి పండించిన వరి ధాన్యం రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వాలన్న సంకల్పంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోయిన ఖరీఫ్ సీజన్‌లో దిలా వర్‌పూర్, బన్సపల్లి కొనుగోలు కేంద్రాల ద్వా రా సుమారు 16,436 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. అందుకు రైతులకు రూ.3కోట్ల 66లక్షల 52వేల 280 చెల్లించారు. సన్నరకం ధాన్యానికి బోనస్ కింద క్వింటాకు రూ. 500 చొప్పున అదనంగా రూ. 24,90,000 లు చెల్లించారు. యాసంగిలో 8 కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వీటిలో ఐదు దొడ్డు రకం ధాన్యం, మూడు సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేస్తున్నారు.

అందరి సహకారంతోనే లాభాలు

● పూంద్రు వెంకట రమణ రెడ్డి, చైర్మన్, (పీఏసీఎస్)



మా పాలక వర్గం సభ్యులు, సిబ్బంది సహకారంతో నష్టాల్లో ఉన్న మా పీఏసీఎస్‌ను లాభాల బాటలోకి తెచ్చాం. ముఖ్యంగా రైతుల సహకారం కూడా చాలా ఉంది. రైతు లకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. రైతులు వ్యవసాయ అనుబంధ యూనిట్లు పెట్టుకుంటే రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఎరువుల బస్తాలను భద్రంగా ఉంచేందుకు గోడౌన్‌ల నిర్మాణం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

పరీక్షలు చేయక.. భూసారం తెలియక

● ఏ పంటలు వేయాలో తెలియక నష్టపోతున్న రైతులు

కుభీర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు సేద్యానికి వెన్నుదన్నుగా ఉండాలి. ఏళ్ల తరబడి పరీక్షలు లేక, ఏ రకమైన పంటలు వేయాలనేది స్పష్టత లేక ఇష్టానుసారంగా సాగు చేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం మూడేళ్లకోసారి పరీక్షలు చేసి వివరాలు రైతులకు వెల్లడిస్తే, దానికి అనుగుణంగా ఏ పంటలు వేయాలనే వ్యవసాయ అధికారులు సూచనలు ఇస్తే నష్టాల నుంచి గట్టెక్కుతారు. మండలంలో మొత్తం 42 గ్రామ పంచాయతీలకు గాను గత ప్రభుత్వం 9 క్లస్టర్లుగా విభజించి 9 రైతు వేదికలను నిర్మించింది. భూసార పరీక్షలు రైతువేదికల్లో చేయాలని నిర్ణయించి దానికి తగ్గట్టుగా సామగ్రి పంపిణీ చేసింది. అవి ఇప్పుడు కాలం చెల్లి మూలన పడ్డాయి.

● ప్రయోజనం ఇదే..

రైతులు యేటా భూములు సాగు చేసే ముందు పరీక్షలు చేయిస్తే నేల స్వభావం తెలుస్తుంది. అనువైన పంటలు వేయడం స్వభావానికి తగ్గట్టుగా రసాయన ఎరువులు మోతాదులో వేయడంతో పలురకాల ప్రయోజనాలు చేకూరుతాయి. రైతులకు శ్రమ, పెట్టుబడి భారం తగ్గడంతోపాటు ఆదాయం పొందడానికి ఆస్కారం ఉంటుంది.

● కిట్లతోపాటు శిక్షణ అవసరం

మండలంలో వ్యవసాయధికారులు కిట్లను అందజేసింది. ప్రత్యేకంగా శిక్షకుల అవసరమని గతంలో వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పరీక్షలు ఎలా చేయాలనేది కొందరికి శిక్షణ ఇచ్చి రైతు వేదికల్లో ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ఇప్పటికయిన శిక్షకులను ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

● ఖరీఫ్‌లో సాగైన పంటలు

మండలంలో మొత్తం 48207.14 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. కాగా ఖరీఫ్‌లో 29.045 ఎకరాల్లో పత్తి, 17.973 ఎకరాల్లో సోయాబీన్, 2762 ఎకరాల్లో కంది, 284 ఎకరాల్లో మొక్కజొన్న, 50ఎకరాల్లో పసుపు, 261 ఎకరాల విస్తీర్ణంలో మిశ్రమ పంటలను సాగు చేసిన మండల రైతులు వచ్చే ఖరీఫ్‌లో ఏ పంట సాగు చేయాలో అని అయోమయంలో ఉన్నారు. గత ప్రభుత్వాలు ఎప్రిల్, మే నెలల్లో ప్రతి గ్రామ పంచాయతీలో రైతు సదస్సులను ఏర్పాటు చేసి ఏ పంటలు వేయాలి అనేది సాగు విధానం వివరించేవారు. గత పది సంవత్సరాల నుండి రైతు చైతన్య యాత్రలు నిర్వహించ పోవడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు తమ భూమి స్వభావం ఎలా ఉంది, ఏ పంట లను అనుకూలం, ఎరువులు ఏమోతాదులో వేయాలో తెలియక నష్టపోతున్నారు.

కిట్లు పని చేయడం లేదు

● సారికరావు, మండల వ్యవసాయ అధికారి

గతంలో పంపిణీ చేసిన భూసార పరీక్ష కిట్లు పని చేయడం లేదు. మండలంలో 9 రైతువేదికల్లో ఉన్న కిట్లు పని చేయడం లేదు. మండలంలోని 9 రైతు వేదికల్లో ఉన్న కిట్ల పరిస్థితి పై ఉన్నతాధికారులకు వివరించాము. ప్రభుత్వం మండలానికి ఒక ప్రయోజకశాల మంజూరు చేస్తే క్లస్టర్ల వారిగా మట్టి నమూనాలను సేకరించి రైతులకు ఫలితాలను తెలియజేస్తాం.

మద్యం తాగి వాహనాలు నడపరాదు: ఎస్సై

లోకేశ్వరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్ ఎక్స్‌రోడ్, పంచగుడి గోదావరి వంతెన వద్ద ఆదివారం లోకేశ్వరం ఎస్సై అశోక్, వారి సిబ్బంది వాహనాల నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్వరం ఎస్సై అశోక్ మాట్లాడుతూ వాహనదారులు నిజధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, ప్రతిఒక్కరూ రోడ్డు నియమాలు పాటిస్తూ హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించారు. వాహనదారులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లొ దొరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలియజేశారు.


ముత్యాలమ్మ పుష్కరిణిపై నిర్లక్ష్యమేలా?


నిర్లక్ష్యానికి గురవుతున్న అమ్మవారి పుష్కరిణి ఇదే..

దిలావర్‌పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కోరినవారి కొంగు బంగారమై భక్తుల నీరాజనాలు అందుకునే ముత్యాలమ్మ తల్లి పుష్కరిణి నిర్లక్ష్యానికి గురవుతోంది. ఎంతో ప్రసిద్ధిచెందిన ముత్యాల మ్మను దర్శించుకునేందుకు దిలావర్‌పూర్ గ్రామస్థులతో పాటు ప రిసర గ్రామాల ప్రజలు వస్తుంటారు. దిలావర్‌పూర్ గ్రామంలోనైతే ప్రతీ ఇంట్లో కనీసం ఒకరికి ముత్యం, ముత్తవ్వ అనే పేరు కలిగిన వారుంటారంటే అతిశయోక్తి కాదు. అమ్మవారు ఎంతో మహిమా న్వితురాలని ఆ తల్లిని మొక్కుకుంటే కోరిన కోరిక నెరవేరుతుందని నమ్ముతారు. ప్రతీ ఆదివారం ఇక్కడ భక్తులు పండుగలు చేస్తారు. ఎంతో ప్రాచీన చరిత్ర ఉన్న ముత్యాలమ్మ పుష్కరిణి చెత్తా చెదారంతో ఉపయోగించేందుకు నోచుకోవడం లేదు. దీంతో అమ్మ వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. పుష్కరిణిలో స్నానమాచరిస్తే చర్మ రోగాలతోపాటు ప్రతి కూల శక్తుల ప్రభావం తగ్గుతాయని భక్తులు నమ్ముతారు. అంత పవిత్రమైన పుష్కరిణిలో పూడిక పేరుకుపోయింది. అందులో ఉన్న నీరు మురికిగా మారిందని భక్తులు చెప్తున్నారు. పవిత్రమైన పుష్క రిణి నిరాధారణకు గురవుతోందని, పూడిక తొలగించి, చుట్టూ కంచెవేస్తే చెత్తరాకుండా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు. పుష్కరిణి శుభ్రం చేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


దిలావర్‌పూర్ ముత్యాలమ్మ వారి ఆలయం

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.8 । కనిష్ఠం 26.6






6th to 12th Class Girls


4th & 5th Class Girls


1st to 7th Class Boys


1st to 3rd Class Girls


8th to 12th Class Boys

- ఇటీవలే జిల్లాకు చేరిన విద్యార్థుల యూనిఫామ్‌లు

- మారిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాం డిజైన్
- ప్రైమరీ, హైస్కూల్ స్టూడెంట్స్‌కు వేర్వేరు డిజైన్ డ్రెస్‌లు
- పాఠశాలలకు చేరుకున్న డ్రెస్ మెటిరియల్
- జూన్ నెలాఖరు వరకు అందరికీ యూనిఫామ్స్ అందేలా చర్యలు
- యూనిఫాం స్టిచ్చింగ్ బాధ్యతలు ఎస్‌హెచ్‌జీలకు అప్పగింత

విద్యార్థులకు కొత్త యూనిఫామ్‌లు

నిర్మల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గతానికి భిన్నంగా విద్యాశాఖ స్కూల్ యూనిఫాం డిజైన్‌ను మార్పు చేసింది. ప్రైవేటు కార్పొరేట్ విద్యార్థుల యూనిఫాంలకు దీటుగా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ విద్యార్థులకు కొత్త డిజైన్‌లతో యూనిఫాంలను అందించబోతోంది. ఈ మేరకు సమగ్ర శిక్ష అధికారులు తరగతుల వారీగా యూనిఫామ్స్ డిజైన్స్ మార్పు చేశారు. ఈ సారి నుంచి యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళా పొదుపు సంఘాల సభ్యులకు అప్పజెప్పనున్నారు. ప్రతి యేటా విద్యా సంవత్సరం చివరి వరకు కూడా విద్యార్థులందరికీ యూనిఫామ్స్‌కు సంబంధించిన క్లాత్ జిల్లాలకు పంపిణీ జరిగేది కాదు. ఈ సారి మాత్రం విద్యా సంవత్సరం మొదట్లోనే పిల్లలందరికీ యూనిఫామ్స్ అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే స్కూల్స్ రీ ఓపెన్ జరిగిన మూడు నాలుగు రోజుల్లో విద్యార్థులందరికీ తప్పనిసరిగా డిజైన్‌లతో కూడిన యూనిఫామ్స్‌ను అందించాలని నిర్ణయించారు. ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు చదివే బాలికలకు నాలుగు, ఐదో తరగతి చదివే బాలికలకు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే బాలికలకు వేర్వేరు డిజైన్‌లను రూపొందించారు. మొత్తం మూడు రకాల డిజైన్‌లతో కూడిన డ్రెస్‌లను బాలికల కోసం ప్రత్యేకంగా అందించనున్నారు. అలాగే ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదివే బాలురకు చెడ్డీలు, ఎనిమిదవ తరగతి నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులకు ప్యాంట్లను ఈసారి పంపిణీ చేయనున్నారు. దీనికి అనుగుణంగానే మహిళా పొదుపు సంఘాల సభ్యులకు యూనిఫామ్స్ కుట్టే కాంట్రాక్ట్‌ను అప్పజెప్పుతున్నారు. స్కూల్స్ రీ ఓపెన్ అయిన వారం రోజుల్లోనే బడి పిల్లలందరికీ యూనిఫామ్స్‌ను తప్పనిసరిగా అందించాలని ఉన్నతాధికారులు సంబంధిత డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించి స్కూల్ యూనిఫామ్స్ క్లాత్‌ను ముందుగానే అన్ని జిల్లాలకు పంపిణీ చేశారు.

మారిన యూనిఫామ్ డిజైన్‌లు

ఈ సారి ఈ విద్యా సంవత్సరం నుంచి గతంలో మాదిరిగా కాకుండా కొత్త డిజైన్‌లతో స్కూల్ విద్యార్థులకు యూనిఫాంలను అందించబోతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు వేర్వేరు డిజైన్‌లలో యూనిఫాంలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా హైస్కూల్ విద్యార్థులకు ఈ సారి పూర్తి రక్షణతో కూడిన యూనిఫాంలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బాలురకు ప్యాంట్, షర్ట్‌లతో పాటు బాలికలకు కూడా ప్రత్యేక డ్రెస్‌లను రూపొందించారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలకు కూడా డ్రెస్‌లను మార్పు చేశారు. ప్రైవేటు కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు తీసిపోని రీతిలో ఈ సారి నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఆధునిక డిజైన్‌లతో యూనిఫాంలను రూపొందించారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిధిలోని హెడ్ మాస్టర్‌లకు, స్టిచ్చింగ్ బాధ్యతలు తీసుకుంటున్న సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులకు శిక్షణ కూడా పూర్తి చేశారు.

సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకే కుట్టు బాధ్యతలు

ఇదిలా ఉండగా ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన యూనిఫాంల టైలరింగ్ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేవారు. అయితే ఈ విధానానికి స్వస్తి పలికి ఈ విద్యా సంవత్సరం నుంచి టైలరింగ్‌లో అనుభవం ఉన్న సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులకు టైలరింగ్ బాధ్యతలను అప్పగించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే కార్యాచరణ కూడా రూపొందించారు. ఒక్కో యూనిఫాంకు సంబంధించి కుట్టు చార్జీలను సైతం ఖరారు చేశారు. దీనికి సంబంధించి అన్ని పాఠశాలల హెడ్ మాస్టర్‌లకు చార్జీల వివరాలను కూడా అందించారు. ఇప్పటికే శిక్షణలు పూర్తి చేసుకున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు మరికొన్ని రోజుల్లోనే యూనిఫాంలను కుట్టే పనులను చేపట్టబోతున్నారు.

జిల్లాకు చేరుకున్న యూనిఫామ్ క్లాత్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లాలకు సంబంధించిన యూనిఫామ్ క్లాత్ ఇప్పటికే చేరుకుంది. ఆదిలాబాద్ జిల్లాలోని 66,282 మంది విద్యార్థుల కోసం 2,71,420 మీటర్ల క్లాత్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 47,530 మంది విద్యార్థులకు గానూ 1,90,902 మీటర్లు, మంచిర్యాల జిల్లాలో 42,711 మంది విద్యార్థులకు గానూ 1,86,723 మీటర్లు, నిర్మల్ జిల్లాలోని 48,874 మంది విద్యార్థులకు గానూ 2,13,051 క్లాత్‌లు అవసరమున్నట్లు గుర్తించారు.

గురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రం

ఆకస్మిక తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలల్లో 6,7,8,9వ తరగతుల్లో ఏర్పడిన విద్యార్థుల ఖాళీలను భర్తీ చేసేందుకు ఆదివారం జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ప్రవేశ పరీక్షను ఏర్పాటు చేశారు. నిర్మల్‌లోని జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన గురుకుల ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో గల వసతులను ఆయన పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో సరైన లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీరు, తదితర వసతులను ఆయన పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈ పరీక్షకు సంబంధించి మొత్తం 808 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 721 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రం తనిఖీలో డీఈవో పి. రామారావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీసీవో గీత, పర్యవేక్షకులు రమణారెడ్డి, సీఎస్ దశరథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలను అభివృద్ధి చేశా

- మాజీ మంత్రి అల్లోల


మాజీ మంత్రి అల్లోలను సన్మానిస్తున్న దృశ్యం

సారంగాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గంలో ఉన్నటువంటి ఆలయాలను గతంలోనే అభివృద్ధి చేశానని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో గల చించోలి(బీ) గ్రామంలో గంగామాత ఆలయం విగ్రహప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేద పండితులు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద పండితులు వేద మంత్రాలను చదివి గంగామాతకు హారతినిచ్చారు. ఆయన ఆలయంలో ప్రత్యేకపూజలు చేసి మొక్కులను మొక్కి. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ ఆలయ నిర్మాణ పనులు గత ప్రభుత్వంలోనే రూ.12లక్షల నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. అడెల్లి ఆలయ పునఃనిర్మాణ పనుల కోసం నిధులు మంజూరు చేయించి పనులను పూర్తి చేశామని, దీంతో ఆలయానికి మొక్కులను తీర్చుకోవడానికి వచ్చే భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువతో సన్మానించారు. ఆయన భక్తులతో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌లు రమణరెడ్డి, మాణిక్‌రెడ్డి, రైతు సమన్వయ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అట్లా మైపాల్‌రెడ్డి, మాజీ అడెల్లి మహాపోచమ్మ దేవాలయం చైర్మన్‌లు మాధవ్‌రావు, అయిటి చందు, నాయకులు బమేష్ చందు, రమేష్‌లతో పాటు గంగాపుత్ర సంఘ నాయకులు తదితరులు ఉన్నారు.

టూరిజం అభివృద్ధికి కృషి

- కార్పొరేషన్ చైర్మన్ రమేష్ రెడ్డి


చారిత్రక ప్రదేశాలను పరిశీలిస్తున్న రమేష్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో టూరిజం అభివృద్ధికి కృషిచేస్తానని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం నిర్మల్‌లో పర్యటించారు. వినాయకసాగర్, బత్తిస్‌గడ్, శ్యామ్‌గడ్, పాక్‌పట్లలోని క్రోకడైల్ పార్కును సందర్శించారు. గ్రంథాలయ చైర్మన్ అర్జుమండ్ అలీ కోరిక మేరకు ఆయన పర్యటించారు. టూరిజం అభివృద్ధికి నిర్మల్ జిల్లా అనువైందని రమేష్ రెడ్డి అన్నారు. కరీం నగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్, జిల్లా మైనారిటీ చైర్మన్ జునైద్ మెమన్, యూత్ అధ్యక్షుడు సింహారెడ్డి పాల్గొన్నారు.

గొల్లమాడలో
జొన్న కొనుగోలు కేంద్రం కోసం వినతి

నర్సాపూర్(జి), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లమాడలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం మాజీ సర్పంచ్ మహేష్, ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కోరారు. క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు విజయ్ కుమార్, రాజు, రైతులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అడెల్లి పోచమ్మకు ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

సారంగాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడెల్లి పోచమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులను మొక్కి పెరగన్నంను నైవేద్యంగా సమర్పించారు. ఆలయానికి మొక్కులను తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులను ఎదర్కొకుండా ఉండడానికి ఆలయ ఇన్‌చార్జీ ఈవో రమేష్ అన్ని ఏర్పాట్లు చేశారు. మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు జాతకాలను సరి చూసుకున్నారు. నిర్మల్, భైంసా డిపోల నుంచి అధిక సంఖ్యలో బస్సు సౌకార్యలను కల్పించారు.

గిరిజన సమస్యలపై ఆరా తీసిన జీసీసీ చైర్మన్

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సమస్యలపై జీసీసీ చైర్మన్ కోట్నాక్ తిరుపతి ఆరా తీసినట్లు కాంగ్రెస్ నాయకులు జీషన్ అలీ తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ నాయకుడు జీషన్ అలీ నివాసాన్ని రాష్ట్ర గిరిజన కోఆపరేటీవ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక్ తిరుపతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక నాయకులతో కలిసి జీషన్ అలీ సన్మానించారు. అనంతరం తిరుపతి నియోజకవర్గ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాహిద్ అలీ, సయ్యద్ జలీల్, అజార్, ఉస్మాన్ ఖాన్, సల్మాన్ అలీ ఉన్నారు.

అంబలితో శరీరానికి చల్లదనం


అంబలిని పంపిణీ చేస్తున్న జిల్లా అధ్యక్షులు

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అంబలితో శరీరానికి చల్లదనం అని సాయి దీక్ష సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి ఆదివారం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రామచందర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న ప్రారంభమై గత 15 రోజులుగా నిర్విరామంగా కొనసాగుతున్న ఉచిత అంబలి కేంద్రాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... గత కొన్ని సంవత్సరాలుగా ఎండలకు ప్రజలకు చలివేంద్రమును, అలాగే పోషక విలువలు కలిగిన ఆరోగ్య, రుచిక రమైన, శరీరానికి చలువనిచ్చే అంబలిని జిల్లా వాసులతో పాటు పరిసర గ్రామీణ ప్రాంత వాసులకు అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కృష్ణ, వీరార్జున్ పాల్గొన్నారు.

ధరణితో దగా పడిన రైతాంగానికి భూ భారతి ఆధారమవుతోంది

- మంత్రి సీతక్క
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు దక్కుతుంది
- ఖానాపూర్‌లో ఇందిరమ్మ నమూనా గృహం ప్రారంభం



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఖానాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పాలనలో ధరణితో దగా పడిన రైతాంగానికి భూ భారతి చట్టం ఆధారమవుతుందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. ఖానాపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహాన్ని మంత్రి సీతక్క స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో భూ భారతి చట్టంపై నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పాలనలో తెచ్చిన ధరణితో రైతులు ఎన్నో రకాలు ఇబ్బంది పడ్డా రని వివరించారు. ఆ సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారం భూ భారతి నిలువబోతుందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు దక్కు తుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. మొదటి దఫాలో పూర్తి నిరుపేదలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మంత్రి సూచించారు. ఖానాపూర్‌కు తాను ఎప్పుడు వచ్చినా చీకట్లోనే రావాల్సి వస్తుందని, పరిస్థితులు అలా వస్తున్నాయని, ప్రజలు అయినా ఓపికగా వేచి ఉంటున్నందుకు ధన్యవాదాలు అని మంత్రి సీతక్క తెలిపారు.

నిరుపేదల భూముల కబ్జా.

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్ నియోజకవర్గంలో ఉన్న నిరుపేదల భూములను ఓ దొర కబ్జా చేస్తున్నారని ఎమ్మెల్యే వేదిక పైనుంచి ఆరోపించారు. కడెం మండలంలోని భూములను పక్క జిల్లా అయినా జగిత్యాలకు తన పలుకుబడిని ఉపయోగించుకుని బదిలీ చేయించుకున్నాడన్నారు. పునరావాస గ్రామమైన మైసంపేట్ ప్రాంతంలో సైతం నిరుపేదలకు కడెం నారాయణ రెడ్డి కేటాయించిన భూములను సదరు నాయకుడు పట్టాలు చేయించుకున్నారని, ఇటువంటి వారిని వదిలే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. అటువంటి వారి కబంధ హస్తాల్లోకే కడెం రిసార్ట్ సైతం వెళ్లిందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సదరు నేత అక్రమాలపై చర్య లు చేపట్టాలని మంత్రి సీతక్కను కోరారు. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని, సదర్మాట్ ప్రత్యేక కెనాల్ నిర్మాణం చేపట్టాలని, ఖానాపూర్‌లో డిగ్రీ కళా శాల ఏర్పాటు చేయాలని, కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనాన్ని మంజూరు చేయలని మంత్రి సీతక్క దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. వేరువేరు కార్యక్రమాల్లో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నా కళ్యాణి, తహ సీల్దార్ సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ భూ మన్న, వైస్ చైర్మన్ మాజీద్, పీఏసీఎస్ చైర్మన్‌లు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ స్థానిక మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్ తదితరులున్నారు.


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నిధులు కేటాయించండి...

ఖానాపూర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను ఖానాపూర్ కాంగ్రెస్ శ్రేణులు కోరాయి. ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నివాసంలో ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పాల్గొనేందుకు ఖానాపూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆదివారం ఇంద్రవెల్లి అమరుల స్థూపం వద్దకు చేరుకొని ఘనంగా నివాళులర్పించినట్లు కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దయానంద్ తెలిపారు. తరలివెళ్లిన వారిలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మజీద్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రమేష్ ఉన్నారు.